సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: పేద, మధ్యతరగతి ప్రజలకు ఆంధ్రప్రదేశ్‌లో పెద్దఎత్తున అందుతున్న ముఖ్యమంత్రి సహాయ నిధి సాయం పట్ల కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ ఆరోగ్య సమస్యలతో సాయం కోసం దరఖాస్తు చేసుకున్న 21 మందికి ప్రభుత్వం విడుదల చేసిన రూ.15.06 లక్షల విలువైన చెక్కులను శనివారం ఎం.వి.పి. కాలనీలోని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసంలో ఆయన అందజేశారు. అనారోగ్యం ఆధారంగా రూ.25 వేల నుంచి రూ.2 లక్షల వరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందడం పట్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఏయే సమస్యలకు ఈ సాయం అందుతుందనేది గంటా శ్రీనివాసరావును సంజయ్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నార్త్ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, కార్పొరేటర్ పి.వి.నరసింహం, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, జి.సుభాష్ చంద్రబోస్, గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సిటీ పోలీస్ వాట్సాప్ గవర్నెన్స్

పోలీసు సేవలు ఇక మీ వేలిముద్రపైనే..

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: విశాఖపట్నం నగర పోలీసులు ప్రజలకు మరింత చేరువయ్యేందుకు సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా, కేవలం ఒకే ఒక్క వాట్సాప్ మెసేజ్‌తో పోలీసు సేవలను పొందేలా వాట్సాప్ గవర్నెన్స్ వ్యవస్థను బలోపేతం చేశారు. 9552300009 నంబర్కు "Hi" అని మెసేజ్ పంపి ఈ-చలాన్ చెల్లింపులు, ఎఫ్.ఐ.ఆర్ డౌన్లోడ్, కేసు స్టేటస్ వంటి సేవలను మీ ఫోన్ నుండే పొందవచ్చు. పారదర్శకత, వేగవంతమైన సేవల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ విధానం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని పోలీసులు తెలిపారు. తక్షణ సహాయం కోసం ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

వైద్య సేవలకు చేయూతగా సీఎం సహాయ నిధి

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: సంక్షేమం అభివృద్ధి సమపాళ్లలో జోడించి సుపరిపాలన దిశగా కూటమి ప్రభుత్వం ప్రజల అందరి ఆకాంక్షలు నెరవేరుస్తోందని విశాఖ పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ అన్నారు. విశాఖ బీచ్ రోడ్‌లో లాసెన్స్ బే కాలనీలోని విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన 10 లక్షల 52వేల 84 రూపాయల చెక్కులను సంబంధిత లబ్ధిదారులకు అందజేశారు. నెల వ్యవధిలో అర్హులైన వారికి క్రమపద్ధతిలో చెక్కుల పంపిణీ చేయడం విశేషం. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యానికి దూరమయ్యే పరిస్థితి ఏ ఒక్కరికీ

రాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధిని పారదర్శకంగా అమలు చేస్తోం దన్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా డిసిఎమ్ఎస్ ఛైర్మన్ గొంపకృష్ణ కూడా పాల్గొన్నారు. చెక్కులు పొందిన వారిలో ఓలేటి ఉషారాణి (రూ.2 లక్షల 30 వేల 983), దంతులూరి వెంకటరమణ బాబు (రూ.87వేల 985), రిమ్మలపూడి సుబ్బారావు (రూ.లక్షా 723), కోన తాతారావుకి (రూ.25 వేలు), ఆడారి వరలక్ష్మి (రూ.66 వేల 900), గుడివాడ ప్రియాంక (రూ.25 వేలు), తాడిపూడి రాము (రూ.40 వేల 541), కరుబుక్త బంగారు నాయుడు(రూ.88 వేల 334), గుట్టపు వెంకట నాయుడు (రూ.లక్షా 76 వేల 868), గొంప రాము (రూ.2 లక్షల 8 వేల 750) అందజేశారు.

సిఐఐ సదరన్ రీజినల్ కౌన్సిల్ సభ్యులతో ఎంపీ ఇష్టాగోష్టి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఈస్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తోపాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనే సూత్రంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులకు సులభతర విధానాలను అమలు చేస్తోందని విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ పునరుద్ఘాటించారు. విశాఖపట్నంలో సీఐఐ (కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) సదర్న్ రీజినల్ కౌన్సిల్ సభ్యులతో శ్రీభరత్ బీచ్ రోడ్‌లోని రాడిసన్ బ్లూ హోటల్లో ఇష్టాగోష్టి జరిపారు. ఇటీవల విజయవంతంగా నిర్వహించిన 30వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌తో పాటు, విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ ప్రకటించ బడిన నేపథ్యంలో, రాష్ట్రం అంతటా ఈ ప్రాంతంలో ఏర్పడుతున్న కొత్త పెట్టుబడి అవకాశాలను పరిశీలించాలని పరిశ్రమ నాయకులను ఆహ్వానించారు. గతంలో శ్రీభరత్ స్వయంగా వ్యాపార కార్యకలాపాల్లో పొందిన అనుభవాలను పంచుకుంటూ, ప్రభుత్వ విధానాలు ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించేలా ఉండాలంటే ఎలా సహకరిస్తాయో, లేదా అధిక నియంత్రణలు, క్లిష్టమైన అనుసరణ నిబంధనలు, యాదృచ్ఛిక అమలు విధానాల వల్ల

వ్యాపారాల ఎదుగుదలను ఎలా అడ్డుకుంటాయో వివరించారు. అంతేకాకుండా కాలం చెల్లిన, అనవసరమైన చట్టాలు, నిబంధనలను రద్దు చేయడంలో వెనుకంజ వేసి, కొత్త చట్టాలు, నియమాలను తరచూ జోడించే ధోరణి ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తోందని పేర్కొన్నారు. ఈ సవాలును ఎదుర్కొనే దిశగా ఎన్డీయే ప్రభుత్వం ప్రగతిశీల శాసన సంస్కరణలను అమలు చేస్తోందని, అందులో భాగంగా రీపీలింగ్ అండ్ అమెండింగ్ బిల్-2025, జన్ విశ్వాస్ బిల్-2025 వంటి ముఖ్యమైన చర్యలను తీసుకుంటోందని వివరించారు.

పక్కాగా మ్యూజియంల నిర్వహణ

వీఎంఆర్డీఏ ఎంసీ తేజ్ భరత్

విశాలాంధ్ర - విశాఖ: వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సబ్ మెరైన్ మ్యూజియం, టీయూ -142 యుద్ధ విమాన మ్యూజియం, సీ హ్యారియర్ మ్యూజియం, యుహెచ్3హెచ్ హెలికాప్టర్ మ్యూజియంలను పర్యాటకులు ఇష్టపడేలా పరిశుభ్రంగా ఉంచాలని మెట్రోపాలిటన్ కమిషనర్

ఎన్. తేజ్ భరత్ ఆదేశించారు. ఆయన శనివారం క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యూజియంల నిర్వహణలో లోటుపాట్లు ఉండకూడదని అన్నారు. మ్యూజియంల ద్వారా ఆదాయం పెరిగాయన్నారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజనీర్ భవానీ శంకర్, కార్యదర్శి మురళీకృష్ణ, కార్యనిర్వాహక ఇంజనీర్లు జె.సి.పి. సింగ్, రామరాజు, ఉపకార్యనిర్వాహక ఇంజనీర్లు మురళీకృష్ణ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఓఎస్‌జీ ఫౌండేషన్ ఆర్థికసాయం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో సమయ్యవలస గ్రామానికి చెందిన పవన్ కుమార్ అనే విద్యార్థికి రోడ్డు ప్రమాదం జరగడంతో తలకు తీవ్ర గాయాలు కాగా, తలలో రక్తం గడ్డకట్టిన పరిస్థితి ఏర్పడింది. వైద్యుల సూచన మేరకు అత్యవసర శస్త్రచికిత్స చేయాల్సి రావడంతో భారీగా ఖర్చు అవుతుందని కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న పవన్ కుమార్ తల్లిదండ్రులు తమ కుమారుడి పరిస్థితిని పలువురికి వివరిస్తూ సహాయం కోరగా, అదే క్రమంలో ఓఎస్‌జీ ఫౌండేషన్‌ను సంప్రదించారు. విషయాన్ని పూర్తిగా తెలుసుకున్న ఆనందపురం మండలం గంభీరం పంచాయతీకి చెందిన ఓఎస్‌జీ ఫౌండేషన్ సభ్యులు వెంటనే స్పందించి, సోషల్ మీడియా వాట్సాప్ స్టేటస్ ద్వారా ఈ అంశాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. దాతల సహకారంతో పవన్ కుమార్ కుటుంబానికి వైజాగ్ శ్రీ శివాని హాస్పిటల్‌కి వెళ్లి రూ.10 వేలుఆర్థిక సహాయాన్ని ఓ ఎస్‌జీ ఫౌండేషన్ అందజేసింది. ఈ కార్యక్రమంలో శివ దళాయి, అడ్దూరి సురేష్, పీతల గోవింద్ పాల్గొన్నారు.

పది విద్యార్థులకు అవగాహనా సదస్సు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాల సంఘం (జిప్సా) ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలలో చదువుచున్న 10వ తరగతి విద్యార్థులకు జగ్గు జంక్షన్‌లో గల గాజువాక క్లబ్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. మార్చి నెలలో జరుగు పబ్లిక్ పరీక్షలపై ఒత్తిడితో కాదు ఆత్మవిశ్వాసంతో చదివితే విజయాలు చేకూరతాయని జిల్లా విద్యా శాఖాధికారి ప్రేమ్ కుమార్ అన్నారు. కష్టపడి కాకుండా ఇష్టంతో చక్కని ప్రణాళికతో చదివి మంచి మార్కులు సంపాదించి తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ శ్రీనివాస్ సోను ముఖ్య వక్తగా మాట్లాడారు. విద్యార్థులు జీవితంలో స్పష్టమైన, పెద్ద లక్ష్యాలు పెట్టుకోవాలని, వాటి సాధనకై కృషి చేయాలని సూచించారు. పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకుని, పరీక్షలను ఒత్తిడితో కాకుండా ఆత్మవిశ్వాసంతో రాయాలన్నారు. కార్యక్రమంలో అలెన్ కాలేజీ రెండు తెలుగు రాష్ట్రాల డీన్ నందూరి సీతారామ్, జిప్సా గౌరవ అధ్యక్షుడు వి.భాస్కర్ రావు, అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, కార్యదర్శి యస్.షణ్ముఖరావు, కోశాధికారి యమ్.బాబురావు, సభ్యులు రాము, సత్య, వాసుదేవరావు, మౌళి, మురళీ, సత్యన్నారాయణ, నాయుడు, సింహాచలం పాల్గొన్నారు.

ఘనంగా గాయత్రీ కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

విశాలాంధ్ర- విశాఖపట్నం: గాయత్రీ విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ కళాశాల (అటానమస్) 13వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. గాయత్రి కళాశాల రుషికొండ క్యాంపస్ సెంట్రల్ ఆడిటోరియంలో జరిగిన ఈ గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (ఏపీఎస్సీహెచ్ఈ) ఆచార్య కె.మధుమూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య అనేది ఒక విశిష్టమైన సంపద అని చెప్పారు. శరవేగంతో పురోగతి సాగిస్తున్న ఆధునిక సాంకేతిక విజ్ఞానం, కృత్రిమ మేధస్సు, ఏఐ క్వాంటమ్ కంప్యూటర్సులో మెలకువలను అందిపుచ్చుకొని సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పాలని కోరారు. నైపుణ్యాభివృద్ధితో విద్యార్థులు విద్యను అభ్యసించాలని, అలాంటి విద్య తోనే భవిష్యత్తులో ఉన్నతంగా రాణించగలరని అన్నారు. గాయత్రి కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.యస్. బోస్ కళాశాల ప్రగతిని, విద్యాసంబంధ కార్యక్రమ వివరాలను సమగ్రంగా తమ నివేదికలో వివరించారు. డిగ్రీ కోర్సుల నుంచి 80 మంది, పీజీ కోర్సుల నుంచి 318మంది, ఇంజనీరింగ్ విద్య నుంచి 204 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రధానం చేశారు. డిగ్రీ నుండి ఎనిమిది మందికి యంబీఏ నుండి ఒకరికి బంగారు పతకం అందజేశారు. అదే విధంగా యం.బి.ఏ నుండి ఆరుగురి పిహెచ్.డి డిగ్రీలను ప్రదానం చేయడం జరిగినది. జీవీపీ ఉపాధ్యక్షులు ఆచార్య డి. దక్షిణామూర్తి సభా అధ్యక్షత వహించిన కార్యక్రమంలో గాయత్రి విద్యా పరిషత్ యాజమాన్య బృందం సభ్యులు, అధ్యాపక బృందం ప్రతినిధులు మూర్తి, ఆచార్య పి.సోమరాజు, డివియస్. కామేశ్వరరావు,. ఆచార్య పరగడ రాజ గణపతి, ఆచార్య పి.వి. శర్మ, ఆచార్య వి. యస్. ఆర్. కృష? ప్రసాద్, ఆచార్య కె.యస్ బోస్, ఆచార్య యస్. రజని, ఆచార్య డి.సరిత, డి.గిరిధర్, ఆచార్య ఐ.యస్. పల్లవి, ఆచార్య పివి వినయ్, ఆచార్య కె.పి.

పి. ఆర్. ఆర్. శాస్త్రి డి పద్మజ లతో పాటు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే పంచకర్ల స్వాగతం

విశాలాంధ్ర - పెందుర్తి: అనకాపల్లి జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఘన స్వాగతం పలికారు. శనివారం కశింకోట మండలం తాళ్లపాలెం బంగారయ్య పేటలో జరిగిన "స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర" కార్యక్రమానికి, వచ్చిన సీఎం చంద్రబాబుకు తాళ్లపాలెం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద ఎమ్మెల్యే రమేష్ బాబు ఘన స్వాగతం పలికారు.

కొనుగోలుదారులారా మేలుకోండి..

విశాలాంధ్ర- సింహాచలం: గ్రేటర్ విశాఖ ఆయా జోన్‌లలో అక్రమ నిర్మాణాలు జరిగినట్టు పలు పత్రికల్లో వచ్చిన వార్తలు, కథనాలకు సంబంధిత అధికారులు స్పందించి తూతూ మంత్రంగా వారికి నచ్చినట్లు స్లాబ్‌కు కన్నం పెట్టి వెళ్లిపోతారు. కొద్ది రోజుల తర్వాత ఆ కన్నం పూడ్చటానికి సంబంధిత టోన్ ప్లానింగ్ సిబ్బంది ఆయా బిల్డర్‌కు సమాచారం ఇస్తారు. అయితే కన్నానికి రేటు సపరేటు అండి. కాని పలు పత్రికల్లో వార్తలు వస్తే ఆ విలేఖరుకి ముడుపులు అందలేదేమో అని సచివాలయం సిబ్బంది, ఆయా బిల్డర్ కాని బిల్డర్లు, బిల్డర్లు నిందలు వేస్తారు. నిజంగా ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుము చెల్లించి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేయకుండా చేస్తే విలేకరులు ఎందుకు వస్తారు. ఎవరూ శత శాతం నీతివంతులు కాక పోవచ్చు. దానిని ఆసరాగా తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం పూర్తి చేసి. కొనుగోలుదారున్ని నిండా ముంచేస్తారు. హైదరాబాద్‌లో హైడ్రా మాదిరిగా మన రాష్ట్రంలో ఇటీవల కాలంలో విజయవాడ కూడా అక్రమ నిర్మాణాలు కూల్చివేసిన సంగతి పాఠకులకు విదితమే.

23 నుంచి 'పీసా' మహోత్సవాలు: కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖ నగర వేదికగా డిసెంబర్ 23, 24 తేదీల్లో పీసా మహోత్సవాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకలతో పాటు, నగరంలో పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయ విసి హాల్లో ఏర్పాటు చేసిన పత్రిక ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయతీ రాజ్ చట్టం 1996 విస్తరణ జరిగి ఇన్నేళ్లయిన సందర్భంగా విశాఖ పోర్ట్ స్టేడియంలో ఈ మహోత్సవం జరగనుందన్నారు. దేశంలోని 10 రాష్ట్రాల నుండి గిరిజన ప్రతినిధులు, అధికారులు హాజరవుతారని తెలిపారు. 23వ తేదీ ఉదయం బీచ్ రోడ్డులో 10కె రన్ నిర్వహిస్తామని, పోర్ట్ స్టేడియంలో కబడ్డీ, విలువిద్య పోటీలు ఉంటాయని అన్నారు. వివిధ రాష్ట్రాల సంస్కృతి, హస్తకళలు మరియు గిరిజన ఆహార పదార్థాలతో కూడిన 70 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నామని, అందులో 15 స్టాల్స్ మన రాష్ట్రానికి

సంబంధించి ఉంటాయని తెలిపారు. సిగ్నల్స్ వద్ద ఇంజిన్ ఆఫ్ చేయడం వల్ల గాలిలో పొల్యూషన్ తగ్గుతుందనే విషయంపై వాలంటీర్ల ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులను తరచూ తనిఖీలు నిర్వహించేలా అధికారులను ఆదేశించామన్నారు. విశాఖను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు ప్రజలందరూ సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

పోక్సో చట్టంపై అవగాహన

విశాలాంధ్ర - మధురవాడ: లైంగిక వేధింపుల నుంచి బాలలను సంరక్షించే ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ (పోక్సో) చట్టంపై స్థానిక విశాఖ వ్యాలీ సమీపంలోని బాలికాసంరక్షణ కేంద్రంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్యక్రమానికి న్యాయ కళాశాల డీన్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్, డైరక్టర్ డాక్టర్ సి.హెచ్.లక్ష్మణరావు, గీతం న్యాయ సలహ కేంద్రం కోఆర్డి నేటర్ ఎన్.అప్పలరాజు హాజరై పోక్సో చట్టం బాలలను లైంగింక వేదింపుల నుంచి ఎలా సంరక్షిస్తుందో వివరించారు. మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాను ఎలా గుర్తించాలో వివరించారు. గీతం న్యాయ సలహ కేంద్రం సభ్యులు బాలికలకు పలు ఆత్మ రక్షణ విధానాలను తెలియజేశారు. అపరిచిత వ్యక్తుల నుంచే కాక బాగా పరిచయం ఉన్న వ్యక్తులు అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా బాలికా సంరక్షణ పట్ల నిబద్ధతతో ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

గాజువాక జోన్‌లో ఆక్రమణల తొలగింపులు

విశాలాంధ్ర - అగనంపూడి: జీవీఎంసీ పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగం గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న ఆపరేషన్ లంగ్స్ 02 నేపథ్యంలో గాజువాక జోన్‌లో టౌన్ ప్లానింగ్ డిసిపి కె.వెంకటేశ్వరరావు, ఏసీబీ కే.వెంకట్రావు సారధ్యంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది పెద్ద ఎత్తున జోరుగా ఆక్రమణలు తొలగింపు చర్యలు చేపడుతున్నారు. శనివారం వడ్లపూడి మార్కెట్ రోడ్‌లో భారీగా ఆక్రమణలు తొలగించి రోడ్లను వెడల్పు చేశారు. అలాగే గాజువాక బిసి రోడ్ పెదగంట్యాడలో పలు అనధికార ఆక్రమణలు తొలగించారు. ప్లానింగ్ సిబ్బంది, పోలీసులు సహకారంతో టౌన్ ప్లానింగ్ గాజువాక జోన్‌లో విస్తృతంగా రోడ్లపై ఉన్న బడ్డీలు తొలగింపు తోపాటు ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు.

అనకాపల్లి కలెక్టర్‌పై సీఎస్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రాజకీయ పైరవీకారుడు మురళీతో అనకాపల్లి జిల్లా కలెక్టరు అతిచనువు పోటోలు సివిల్ సర్వెంట్స్ కోడ్ ఆఫ్ కాండక్టు, కోడ్ ఆఫ్ డిసిప్లైన్‌కు విరుద్ధమని, తక్షణమే ఈ సన్నిహితత్వంపై విచారణ చేపట్టాలని విదసం ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండు చేసారు. పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అయిన అనకాపల్లి కలెక్టరు భుజంమీద అధికార పార్టీ పైరవీకారుడు చేయి వేసి ఇద్దరూ కలిసి చూపిన సంకేతంలో అంతరార్థం, ప్రజా ప్రయోజనం ఏమిటో విచారణ జరిపి కలెక్టరుపై చర్యలు తీసుకోవాలని ప్రధాని మోడీకి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినట్టు వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. పత్రికల్లో వచ్చిన కథనాలు ప్రకారం అధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ దగ్గర బంధువు అయిన మురళి ప్రభుత్వంలో ఏ హోదా లేక పోయినా పెద్ద స్థాయి అధికారులను శాసించి అక్రమ పద్ధతుల్లో తన పైరవీ వ్యవహారాలు చక్క బెట్టుకుంటుంటే అలాంటి వ్యక్తితో అత్యంత సన్నిహితత్వం బహిర్గతం చేయడం కలెక్టరు స్థాయికి తగదని, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పేదలకు అండగా కూటమి సర్కార్

విశాలాంధ్ర - భీమిలి: పేదల కన్నీళ్లు తుడిచి వారి కష్టాల్లో అండగా ఉండడమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి సర్కార్ పనిచేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. భీమిలి జోన్ 3వ వార్డుకు చెందిన బాధిత లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతులమీదుగా శనివారం ఎంపీపీలో ఉన్న నివాసం వద్ద అందించారు. ఈ కార్యక్రమంలో గంటా నూకరాజు పాల్గొని సిఎం రిలీఫ్ ఫండ్ యొక్క వివరాలను లబ్ధిదారులకు తెలియజేసారు. బోయవీధికి చెందిన కాసరపు అచ్చియ్యమ్మకు 1,07,000, కొక్కిరి జంపయ్యకు 32,000, ఆడిదం అంజనీకుమార్‌కు 25,000ల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఇన్‌చార్జ్ చిక్కాల విజయ్ బాబు, నాయకులు కాసరపు నాగరాజు, సంకురుభుక్త జోగారావు, వాడమొదలు సత్యారావు, నెక్కెళ్ళ వెంకటరావు, అల్లిపిల్లి సతీష్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

46వ వార్డులో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛభారత్ స్వర్ణాంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే లక్ష్యంతో, విశాఖ ఉత్తర నియోజవర్గం 46వ వార్డు పరిధిలోని కస్తూరి నగర్ ప్రాంతంలో స్వచ్ఛభారత్-స్వర్ణాంధ్రప్రదేశ్ స్వచ్ఛ

ఆంధ్ర ప్రతిజ్ఞ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. అన్ని సచివాలయం పరిధి శానిటేషన్ సెక్రటరీలు, 46వ వార్డు ఇన్‌స్పెక్టర్ సత్యం ఆహ్వానం మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ముఖ్య అతిథిగా విచ్చేయగా, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంటేనే మన వీధులు పరిశుభ్రంగా ఉంటాయి. మన వీధులు శుభ్రంగా ఉంటే మన ఆరోగ్యం, మన జీవితం బాగుంటుంది" అని ప్రజలకు వివరించారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని ప్రతి వీధిలో చురుగ్గా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్ సత్యం, వార్డు సీఓ వరలక్ష్మి, టీడీపీ వార్డు అధ్యక్షులు పైడికొండ, వార్డ్ శానిటేషన్ మేస్త్రి రామారావు, అలాగే కె.చిన్నా, కృష్ణ, లావణ్య, దేవి, మల్లేశ్వరరావు, ఆర్పీలు, సైనికులు, పెద్ద ఎత్తున మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

ఎన్ఎన్ఎస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

విశాలాంధ్ర - భీమిలి: స్థానిక ఎస్‌విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం అప్పన్న కాలనీలో ఏర్పాటు చేయడం జరిగింది. ఆరవ రోజు ఎన్ఎన్ఎస్ ప్రత్యేక శిబిరం కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం మరియు ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సహాయంతో యోగా సెషన్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సురేఖ మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి శిబిరాల ద్వారా సమాజంలో ఉన్న సమస్యలను తెలుసుకొని సమాజ శ్రేయస్సు గురించి కృషి చేస్తారని ఆశించారు. అనంతరం అప్పన్న కాలనీలో సైన్ బోర్డ్ ఏర్పాటు చేశారు. దీనివల్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీను పాల్గొన్నారు.

సమన్వయం కొరవడింది

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి ఆలయంలో అధికారులకు సెక్యులర్ సిబ్బందికి మధ్య సమన్వయం కొరవడింది. నిన్న పగల్ పత్తు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని భక్తులకు స్వామివారి ఎటువంటి సమాచారం లేకుండా ఉదయం సుమారు 45 నిమిషాలు దర్శనం జరుగలేదు. సెక్యులర్ సిబ్బందిలో ఓ ముఖ్య మైన వారు ఆలయ పర్యవేక్షణ అధికారిపై భక్తుల ముందు దేవుడు కోసం మేము పరిచర్యలు, పూజలు వగైరా చేస్తుంటే మీరు భక్తులకు ఎలా దర్శనాలు ఇస్తారని శివాలెత్తిపోయారు. సమీపంలో ఉన్న సహాయ కార్యనిర్వహణాధికారి వెంటనే కలుగ చేసుకుని మీరు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఓ అధికారిపై భక్తుల ముందు అలా అరవటం సబబు కాదని అన్నారు. ఆ సహాయ కార్యనిర్వహణాధికారి అంతా సద్దు మణిగించి పూజా కార్యక్రమం, నైవేద్యం సమర్పించి భక్తులకు దర్శనాలు కల్పించారు.

కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుందని మాజీ మంత్రి, అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ విమర్శించారు. శనివారం వైసీపీ జిల్లా పార్టీ

కార్యాలంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2ఏళ్ళు కాకముందే ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. ప్రజల నుంచి పాజిటివ్ అవుట్ పుట్ రావడం లేదని కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో స్వయంగా సీఎం చంద్రబాబు అంగీకరించారన్నారు. చంద్రబాబు ఏ రోజు కారోజు అప్పు - లేదంటే కొడుకు గురించి డప్పు తప్ప రాష్ట్రానికి చేసింది ఏమీ లేదన్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్ లకు 99 పైసలకే ఎకరా కేటాయిస్తున్నారు. అదే ముసుగులో రియల్ ఎస్టేట్ సంస్థలకూ భూసంతర్పణ చేస్తున్నారని విమర్శించారు. రోజుకి సగటున రూ.500 కోట్లు చెప్పున గడిచిన 18 నెలల్లో చంద్రబాబు ప్రభుత్వం రూ.2.75 లక్షల కోట్లు అప్పు చేసింది. ప్రభుత్వాలు అప్పు చేస్తే ఆ డబ్బు ఆస్తుల రూపంలోనైనా ఉండాలి.. లేదా సంక్షేమం, అభివృద్ధి రూపంలో ప్రజలదగ్గరైనా ఉండాలి. ఈ రెండూ కాకుండా కూటమి ప్రభుత్వం చేసిన అప్పు ఏమైందని నీలాదీశారు.

వెంకటాద్రి క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి వెంకటాద్రిపై శనివారం ఐదో రోజు ధనుర్మాస ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు మహంతి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం 4:30 గంటలకు స్వామివారిని మేల్కొల్పి, హారతి, సేవకాలం, శాత్తుమొరై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, తీర్థ గోష్ఠి మరియు ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతిరోజు ఉదయం సేవా కార్యక్రమాలు ఉంటాయని రామానుజాచార్యులు తెలిపారు. ప్రతి రోజు కొండ దిగువ నుండి ఆలయం వరకు ఉచిత వాహన సదుపాయం ఉంటుందని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం వారు ఏర్పాటు చేశారని వెల్లడించారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి నీలిమ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విశాఖను మరింత పరిశుభ్రంగా ఉంచుదాం

మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యంగా విశాఖ నగరాన్ని మరింత పరిశుభ్రపరచుకుంటూ అభివృద్ధి పథంలో నడిపించుకుందామని, ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణలో ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తద్వారా మంచి పర్యావరణ నగరంగా విశాఖను తీర్చిదిద్దగలమని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఆయన ఆర్‌కె బీచ్ సమీపంలో జీవీఎంసీ నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ లతో కలసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పరిశుభ్రత దిశగా మరింత అభివృద్ధి పరిచేందుకు రాష్ట్రమంతటా స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ప్రతి నెల మూడవ శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి సాధించేందుకు వ్యర్థాలు సేకరణ, రవాణా వనరుల పునరుద్ధరణ రీసైక్లింగ్ చేయడం ద్వారా స్వయం ఉపాధి

అవకాశాలు లభిస్తాయన్నారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ నగరంలో పనికిరాని వ్యర్థాలను, ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడం, వేస్ట్ మేనేజ్మెంట్ ద్వారా వచ్చని పర్యావరణం, ఆర్థిక అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి. రమణమూర్తి, ఎస్ ఎస్ వర్మ, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ శివప్రసాద్, సహాయ వైద్యాధికారి బి.ప్రసాదరావు, ఏపీడీలు, సచివాలయ వార్డు కార్యదర్శులు, పలువురు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరవస్తు చిన్నయ సూరి జయంతి

- కడిమిళ్ళ వరప్రసాద్‌కు చిన్నయసూరి వ్యాకరణ పురస్కారం ప్రదానం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: నగరంలోని పౌర గ్రంథాలయంలో శనివారం పరవస్తు పద్య పీఠం, తెలుగు దండు సంయుక్త ఆధ్వర్యంలో పరవస్తు చిన్నయ సూరి 219వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త, గురు సహస్రావధాని డా.కడిమిళ్ళ వరప్రసాద్‌కు పరవస్తు చిన్నయ్య సూరి వ్యాకరణ పురస్కారాన్ని ప్రధానం చేశారు. సభకు డా.బేతవోలు రామబ్రహ్మం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా.. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి ఉప్మాక దుర్గాప్రసాద్ రావు, శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు, డా.కె.ఐ.వరప్రసాదరెడ్డి, తానా పూర్వ అధ్యక్షులు డా.తోటకూర ప్రసాద్, విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత డా.సూరపనేని విజయకుమార్ పాల్గొన్నారు. పురస్కార గ్రహీత, ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. చిన్నయసూరి సాహితీ సేవను కొనియాడారు. బాల వ్యాకరణ వైభవాన్ని, నీతిచంద్రిక గొప్పతనాన్ని వివరించారు. తెలుగుదండు ఆధ్వర్యంలో నిర్వహించిన "టిట్టిభ సత్యాగ్రహం" నిరసన దీక్షలో పాల్గొన్న కవులకు, కళాకారులకు, భాషాభిమానులకు ఈ సందర్భంగా వేదికపై చిరు సత్కారాలు అందజేశారు. కార్యక్రమంలో.. బివికె కళాశాల విద్యార్థులు, వండర్ కిడ్స్ పాఠశాల విద్యార్థులు పాల్గొని ముఖ్య అతిథులను సత్కరించారు.

శ్రీ హరిహర నృత్యనికేతన్ చిన్నారులు. "చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా...." వంటి గీతాలకు నృత్యం చేసి ప్రేక్షకులను అలరించారు. పరవస్తు పద్యపీఠం, తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు సూరి సభాసమన్వయకులుగా వ్యవహరించారు.

పిఎసిఎస్ చైర్మన్ రౌతు నాగరాజు ఆధ్వర్యంలో 30 మంది యువకులు జనసేనలో చేరిక

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం బంటుపల్లి గ్రామపంచాయతీలో జనసేన పార్టీ నాయకులు వేములవలస పిఎసిఎస్ చైర్మన్ రౌతు నాగరాజు, డాక్టర్ పిన్నింటి సన్యాసిరావు ఆధ్వర్యంలో కాలనీ నుండి వెన్ని అప్పలరాజు ఆధ్వర్యంలో సుమారు 30 మందికి పైగా యువకులు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భీమిలి జనసేన పార్టీ ఇన్‌చార్జ్, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ సందీప్ పంచకర్ల, ఇచ్చేశారు. ఇన్‌చార్జి సందీప్ మాట్లాడుతూ బంటుపల్లి గ్రామపంచాయతీలో జనసేన పార్టీ బలంగా ఉందనడానికి నామినేటెడ్ పదవుల్లో భాగంగా వేములవలస పిఎసిఎస్ చైర్మన్ పదవిని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రౌతు నాగరాజుకు పదవి అందించడం జరిగిందని, గత 10 సంవత్సరాల నుండి పార్టీలో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయడం వల్ల ఈరోజు పంచాయతీకి గౌరవం దక్కిందని ఈరోజు కాలనీ నుండి 30 మంది యువకులు పార్టీలో చేరడం శుభపరిణామం అని పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి జనసేన పార్టీ గుర్తింపు ఇస్తుందని అందుకు నాగరాజు ఉదాహరణ అని తెలిపారు. అలాగే ప్రస్తుతం గ్రామంలో ఉన్న ప్రభుత్వ

కాలనీలకు రోడ్లు, మౌలిక సదుపాయాలు, పాఠశాల భవనం నిర్మాణానికి నూతనంగా నిర్మిస్తున్నటువంటి రహదారి నిర్మాణానికి గ్రావెల్ అవసరం ఉన్న విషయాన్ని పిఎసిఎస్ చైర్మన్ ఇన్‌చార్జ్ దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన సందీప్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురిమిన రామస్వామి, జనసేన నాయకులు శీను బాబు, కృష్ణయ్య, మజ్జి శ్రీను, మండల పార్టీ అధ్యక్షులు తమ్మిన అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి మూర్తి, ఉపాధ్యక్షులు బాలు శివకృష్ణ, డాక్టర్ పిన్నింటి సన్యాసిరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామలక్ష్మి, స్థానిక నాయకులు మీసాల గాయత్రి అప్పలరాజు, దుర్గా నరసింహనాయుడు, గండ్రెటి వంశి, దొంతల అప్పలరాజు, చందక ఉపేంద్ర నాయుడు, కూటమినాయకులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో క్షీణించిన శాంతి భద్రతలు

- వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అన్నారు. శనివారం జిల్లా వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సీఎం చంద్రబాబుకు రాసిన లేఖ, కలెక్టర్ల కానరేన్స్ నివేదికలే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం అన్నారు. రాష్ట్రంలోని మహిళలకు ఇంటా బయటా రక్షణ లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో టీడీపీ నేతల అండతోనే డ్రగ్స్, గంజాయి సరఫరా జరుగుతోందన్నారు. రెడ్‌బుక్

రాజ్యాంగంతో నేరాలకు ఊతం కల్పిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని సన్‌రైజ్ స్టేట్‌గా మారుస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, వాస్తవానికి ఆంధ్రప్రదేశ్‌ను 'క్రైమ్ రైజింగ్ స్టేట్'గా మార్చారాని ధ్వజమెత్తారు. శాంతిభద్రతలు అదుపుచేయడంలో హోం మంత్రి విఫలం చెందారని ఆరోపించారు. కబ్జాదారులు, హత్యలు, అత్యాచారాలు చేసే నేరస్థులను ఈ ప్రభుత్వమే కాపాడుతుండటమే శాంతిభద్రతలు ఇంతగా క్షీణించడానికి కారణం అన్నారు.

వ్యక్తిత్వ వికాసానికి వ్యాయామం ఒక గీటురాయి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

విశాలాంధ్ర - భీమిలి: మనిషి తన జీవనశైలిలో వ్యాయామం ఒక గీటురాయని ప్రతీ ఒక్కరూ రోజులో కొంత సమయాన్ని వ్యాయామం కోసం కేటాయించుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. 63వ విశాఖ జిల్లా పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ (పురుషులు, మహిళల విభాగంలో) చాంపియన్ షిప్-2025 పోటీలు విశాఖ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, శ్రీ విజయేంద్ర వ్యాయామ మండలి ఆధ్వర్యంలో శనివారం సంగివలస మైదానంలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మాజీ బీసీడి నాయకుడు అక్కరమాని మంగరాజు హాజరై ప్రారంభోత్సవం చేసారు. ఈ వ్యాయామానికి ప్రో పిట్ నెస్ జోన్ రవి, కమల్ ట్రైనర్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యమే మహా భాగ్యమని మన పూర్వీకులు చెప్పేవారని అన్నారు. కార్యక్రమంలో మాజీ బీసీడి నాయకుడు అక్కరమాని మంగరాజు, నేషనల్ పవర్ లిఫ్టర్ పవర్ లిఫ్టింగ్ ఇండియా నేషనల్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ మద్ది ప్రభాకర్‌రావు, ఐబిబిఎఫ్ వైస్ ప్రెసిడెంట్ కె.గురునాదరావు, అక్కరమాని బుజ్జి, లోవరాజు, నమ్మి సూరిబాబు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

గీతంలో "లాసా" 13వ అంతర్జాతీయ సమావేశాలు ముగింపు

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న లేబొరేటరీ యానిమల్ సైంటిస్ట్స్ అసోసియేషన్ (లాసా) 13వ అంతర్జాతీయ సమావేశాలు శనివారం విరించి హస్పటల్స్ చైర్‌పర్సన్ మరియు మేనేజింగ్ డైరక్టర్ శ్రీమతి కొంపెల్లి మాదవి లత ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పరిశోధకలను అమె అభినందించారు. జీవ వైద్య శాస్త్రాల్లో ప్రగతికి ప్రీ క్లినికల్ జంతు అధ్యయనాలు ఏంతో కీలకమైనవని అయితే ఆ అధ్యయనాలు సరైన విధంగా రూపకల్పన చేయకపోతే వనరుల వృధాతో పాటు ఔషధ పరిశోధనల శాస్త్రీయ పురోగతిలో అలస్యం జరగవచ్చునని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. యునెస్కో ప్రాంతీయ బయోటెక్నాలజి కేంద్రం పరిశోధకుడు డాక్టర్ రాజేంద్రర్‌కె.మోతియాని మాట్లాడుతూ మానవ వ్యాధుల పై మనకు ఉన్న ప్రస్తుత అవగాహనకు ప్రీ క్లినికల్ జంతు అధ్యయనాలు ఎంతో దోహదపడ్డాయని అయితే ఈ అధ్యయనాలు చేస్తున్నప్పుడు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని, శాస్త్రీయ ప్రమాణాలు మరియు నైతిక విలువలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఫార్మాకాలజీ విభాగానికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ అజయ్ గాడ్విన్ పొట్నూరి మాట్లాడుతూ ఇటీవల ఔషధ ప్రయోగాలకు జంతువులను వాడకుండా ప్రత్యామ్నాయ పద్దతులను నాన్-యానిమల్ న్యూ అప్‌రోచ్ మెథడాలజీస్ (నామ్స్) పేరిట అభివృద్ధి చేశారని అవి గుండెకు సంబంధించిన భద్రతా పరీక్షల రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చాయని తెలిపారు. ఇవి జంతు ప్రయోగాల పై ఆధారాన్ని తగ్గిస్తూ, మెరుగైన అంచనాలకు

సహాయపడుతున్నాయని చెప్పారు. సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ (సిసిఎమ్‌బి) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్, మొహమ్మద్ ఇద్‌రిస్ మాట్లాడుతూ తాము అభివృద్ధి చేసిన ప్రత్యామ్నాయ జంతు నమూనాలు ప్రాథమిక జీవశాస్త్రం మరియు వైద్య వినియోగాల మధ్య వారిధిగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఇవి పునరుత్పత్తి వైద్యం మరియు వ్యాధి నివారణకు కొత్త మార్గాలను తెరుస్తున్నాయని చెప్పారు.

శ్రీలంకలోని కొలంబో విశ్వవిద్యాలయానికి చెందిన రసాయన శాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ ప్రసాది నయునాశని డి.సిల్వా మాట్లాడుతూ జీబ్రాఫిష్‌లకు మనుషులకు మధ్య జన్యుపరమైన సారూప్యత కారణంగా వైద్య పరిశోధనల్లో అవి ముఖ్యమైన మోడల్‌గా మారాయని తెలిపారు. పరిశోధనల్లో నమ్మదగిన ఫలితాల కోసం అరోగ్యకరమైన జీబ్రా ఫిష్ కాలనీల నిర్వహణ చాలా అవసరమని ఆమె పేర్కొన్నారు. ఆంకోసిక్ బయో వ్యవస్థాపకుడు మరియు వ్యాస్ క్యాన్సర్ రీసెర్చి పార్క్ సలహదారుడు డాక్టార్ సురేష్ పూసాల మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు (ఎఐ) మరియు మెషిన్ లెర్నింగ్ (ఎమ్‌ఎల్)ల పరిజ్ఞానం ఔషధాల ఫలితాల విశ్లేషణ మరియు కొత్త ఔషధాల విజయావకాశాల అంచనాలకు సహయపడుతున్నాయని వివరించారు.

జంతు క్వారంటైన్ మరియు సర్టిఫికేషన్ సర్వీసెస్ డిప్యూటీ కమీషనర్ డాక్టర్ సోనియా శర్మ మాట్లాడుతూ అంతర్జాతీయ వాణిజ్యం మరియు ప్రయాణాలు పెరగడంతో ప్రమాదకరమైన వ్యాధులు దేశంలోకి వచ్చే అవకాశం ఉన్న కారణంగా ప్రముఖ పట్టణాలలో క్వారంటైన్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, దేశంలోకి పరిశోధనల నిమిత్తం దిగుమతి అయ్యే జంతువులను ఈ కేంద్రాలలో పరీక్షించిన మీదటే పరిశోధనలకు అనుమతి ఇస్తున్నామని వెల్లడించారు. ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో లాసా జాతీయ అధ్యక్షుడు, సిఎస్ఐఆర్ శాస్త్రవేత్త డాక్టర్ విజయపాల్‌సింగ్, ఈ సమావేశాల కమిటి చైర్మన్ ప్రొఫెసర్ ఎల్.శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ ఆర్.కె.శక్తి దేవన్, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ జి.సుహాసిని, కన్వీనర్లు డాక్టర్ నేమాని హరిశంకర్, డాక్టర్ నితిన్ యాదవ్ తదితరులు పాల్గొని సర్టిఫికేట్లు అందజేశారు. ఈ అంతర్జాతీయ సమావేశాలకు దేశ విదేశాలకు చెందిన జంతు శాస్త్రవేత్తలు, ఔషధరంగ నిపుణులు, వెటర్నరీ సైన్స్ పరిశోధకులు మరియు దేశంలోని కేంద్ర పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలు మొత్తం 600 మందికి పైగా ప్రతినిధులు, 100 వలంటీర్లు పాల్గొన్నారు.